# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల జరిపిన 5 దేశాల పర్యటనలో 57 కీలక ఒప్పందాలు కుదిరాయని ప్రభుత్వం తెలిపింది.

❖ నిజాయితీగా కష్టపడాలని, విజయంలో వినయంగా ఉండాలని విద్యార్థులకు ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ సూచించారు.

❖ డిజిటల్ డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్ మొదలైన రంగాలలో భారత్ - అమెరికా దేశాలు సహజ భాగస్వాములుగా కలిసి పని చేస్తున్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

❖ అహ్మదాబాద్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

===================

ప్రపంచ దేశాలు భారత్ ను ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తున్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనపై న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధాని పర్యటన సమాజంలోని ప్రతి వర్గానికి ప్రయోజనాలను చేకూరుస్తుందన్నారు. ఈ పర్యటన సందర్భంగా భారతదేశంలో 75 నుంచి 100 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఇచ్చిన హామీతో సహా, 57 కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఆరు రోజుల పాటూ సాగిన ప్రధానమంత్రి విదేశీ పర్యటన నిన్నటితో ముగిసింది.

===================

నిజాయితీగా కష్టపడాలని, విజయంలో వినయంగా ఉండాలని విద్యార్థులకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు. ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అద్భుతంగా రాణించిన ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 41 మంది విద్యార్థుల బృందాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తీసుకువెళ్లింది. ఆ బృందం ఈరోజు

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కలిసింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను విద్యా పర్యటన నిమిత్తం ఢిల్లీకి తీసుకువచ్చిన ఈ చొరవను ప్రశంసిస్తూ... ఇలాంటి పర్యటనలు విద్యార్థులు తరగతి గదులకు అతీతంగా నేర్చుకోవడానికి, వారి పరిధులను విస్తరించుకోవడానికి సహాయపడతాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎందరో గొప్ప శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, దేశ నాయకులు ఆవిర్భవించారని ఉపరాష్ట్రపతి విద్యార్థులకు గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, ఆహార భద్రతను బలోపేతం చేయడం ద్వారా భారత్ ప్రపంచానికి ఒక కొత్త వ్యవసాయ నమూనాగా మారిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఇటలీ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆహార వ్యవసాయ సంస్థ (FAO) అగ్రికోలా పతకాన్ని ప్రధానం చేయడం పట్ల కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ గౌరవం పెరుగుతున్న భారతదేశపు ప్రతిష్టకు చిహ్నమని విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఈ పురస్కారం దేశంలోని కష్టపడి పని చేసే రైతులకు సజీవ నిదర్శనమని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైనప్పటి నుండి, ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా లక్షలాది మంది రైతులకు మద్దతునిస్తూ.. దాదాపు 80 కోట్ల మందికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా భరోసాను కల్పిస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సియోల్ నగరంలోని ఇమ్జింగాక్ పార్క్‌లో భారత యుద్ధ స్మారక చిహ్నాన్ని ప్రారంభించారు. కొరియా యుద్ధం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన స్మారక కార్యక్రమాలలో భాగంగా నిర్మించిన ఈ స్మారక చిహ్నం.. యుద్ధ సమయంలో భారత సైన్యానికి చెందిన 60 పారా ఫీల్డ్ అంబులెన్స్ కస్టోడియన్ ఫోర్స్ ఆఫ్ ఇండియా (CFI) అందించిన ధైర్యం, త్యాగం, మానవతా సేవకు నివాళిగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... ఇరు దేశాల ఉమ్మడి చరిత్ర, త్యాగాలు భారత్ - రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాదిగా నిలుస్తూనే ఉన్నాయని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారత్, అమెరికా దేశాలు సహజ భాగస్వాములుగా కలిసి పని చేస్తున్నాయని సాంకేతిక ఆవిష్కరణలు, డిజిటల్ డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, వైద్య పరికరాలు వంటి పలు రంగాలలో పరస్పరం సహకరించుకుంటున్నాయని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక నాయకత్వ సదస్సులో ఆయన ఈరోజు ప్రసంగిస్తూ... ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం పరస్పర విశ్వాసం, ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలతో మరింత బలపడిందని చెప్పారు. అదే విధంగా ప్రపంచ సరఫరా గొలుసులను బలోపేతం చేయడంలో ఎంఎస్ఎంఈల పాత్రను ప్రస్తావిస్తూ.. ఎంఎస్ఎంఈల సాంకేతిక ఉన్నతీకరణ, నైపుణ్యాభివృద్ధికి మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ సహాయపడుతుందన్నారు. రాబోయే 25 సంవత్సరాల పాటు భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో ఎబోలా వైరస్ కారణంగా నెలకొన్న ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా, ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సిన నాలుగో భారత్ - ఆఫ్రికా ఫోరం శిఖరాగ్ర సమావేశాన్ని వాయిదా వేశారు. ఆఫ్రికన్ యూనియన్ ఛైర్ పర్సన్, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్‌లతో భారత్ ఈ విషయమై సంప్రదింపులు జరిపిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సంప్రదింపుల అనంతరం.. నాలుగవ భారత్ - ఆఫ్రికా ఫోరమ్ శిఖరాగ్ర సమావేశాన్ని వాయిదా వేయాలని నిర్ణయించారని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ శిఖరాగ్ర సమావేశం కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేసిన అనంతరం తెలియజేయడం జరుగుతుందని వెల్లడించింది. అలాగే, మారుతున్న ఆరోగ్య పరిస్థితిని పరిష్కరించే లక్ష్యంతో ఆఫ్రికా CDC నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలకు సహకరించడానికి భారత్ తన సంసిద్ధతను ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

ఎబోలా వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాల నుంచి భారతదేశానికి వచ్చే ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రయాణ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కీలక ఆరోగ్య మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు ముందే ఆరోగ్య అధికారులను సంప్రదించాలని కోరింది. ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎబోలా లక్షణాలు కనిపిస్తే వెంటనే విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా  చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన చెన్నై తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ టైటాన్స్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 121 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ 63, సాయ్ సుదర్శన్ 49 పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =